మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## సిఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన అర్చకులు



సిఎం రేవంత్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపికను అందచేస్తున్న శ్రీ కేతకి ఆలయ అర్చకుల దృశ్యం

**ఝరాసంగం, ఆగస్టు 15, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి వచ్చిన సందర్భంగా మండల కేంద్రమైన ఝరాసంగంలోని పార్వతీదేవి సమేతంగా కొలువుండి భక్తులచే దక్షిణ కాశీగా నిత్యపూజలందుకుంటున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు బసయ్యస్వామి అర్చకులతో కలిసి శాలువాతో సత్కరించి శ్రీ కేతకి సంగమేశ్వరుడి ఫోటోను బహూకరించారు. కార్యక్రమంలో శివప్రసాద్‌స్వామి, దిలీప్ కుమార్ జోషి, వీర్ సంగయ్య స్వామి, బసయ్యస్వామిలు ఉన్నారు.

## సిఎం సభకు కాంగ్రెస్ శ్రేణుల భారీ తరలింపు

**కొల్చారం, ఆగస్టు 15, ప్రభాతవార్త:** సంగారెడ్డిలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని తెలిపారు. సభకు తరలివెళ్లిన వారిలో చిన్న ఘనపూర్ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, కొడిపల్లి బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎల్లు గారి శ్రీనివాస్ రెడ్డి, రంగంపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు గొండ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ మంద నాగయ్య, నాయకులు అశోక్, భూమయ్య, శేఖర్, సురేష్, రవీందర్ గౌడ్, సాయ గౌడ్, శంకర్, శ్రావణ్, వెంకట్ గౌడ్, యాద గౌడ్, జీవన్ గౌడ్, దుర్గపతి తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

## త్రిబుల్ ఆర్ కోల్డ్ స్టోరేజ్‌తో యువకులకు మేలు

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**శివ్వంపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త :** త్రిబుల్ ఆర్ కోల్డ్ స్టోరేజ్‌తో యువకులకు ఉద్యోగ అవకాశాలు ఎన్నో ఉంటాయని మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం మండలంలోని దంతాన్‌పల్లి గ్రామ శివారులో త్రిబుల్ ఆర్ కోల్డ్ స్టోరేజ్, వేర్ హౌస్ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్, వేర్ హౌస్ తో రైతులకు అనేక లాభాలు ఉంటాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయడంతో ఇక్కడ ప్రాంతం యువకులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. త్రిబుల్ ఆర్ కోల్డ్ స్టోరేజ్ మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్‌రెడ్డిని మంత్రి వివేక్‌స్వామి అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సర్పంచులు మమత, సమత, డి.ఎస్.పి నరేందర్, సీఐ వెంకటరాజ గౌడ్, ఎస్సై మధుకర్ రెడ్డి, నాయకులు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కన్నారం దుర్గేష్, జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధానుల విగ్రహాలను ఆవిష్కరించిన సిఎం



మాజీ ప్రధానుల విగ్రహాలను ఆవిష్కరించిన సిఎంరేవంత్‌రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో ఆగస్టు 15 ప్రభాతవార్త :** సంగారెడ్డి పట్టణంలోని ఐబి సమీపంలో ఏర్పాటు చేసిన మాజీ ప్రధానులు జవహర్లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీల విగ్రహాలను శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వివేకటస్వామితో కలిసి విగ్రహణం ఆవిష్కరించారు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంగారెడ్డికి వచ్చిన సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన విగ్రహాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు

## మెదక్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జాతీయ జండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** కలెక్టర్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు డిఆర్‌వో అంబాదాస్ రాజేశ్వర్ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం వందేమాతరం, జనగణమన ఆలపించడం జరిగింది. అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జాతీయ జెండాకు అవమానం

### తలకిందులుగా జండావిష్కరణ..

**టేక్మాల్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మెదక్ జిల్లా టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణలో అపశ్రుతి చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుధాకర్ జాతీయ జెండాను పొరబాటున తలికిందులుగా పతాకాన్ని ఆవిష్కరించడం స్థానికంగా కలకలం రేపింది. జండాను కిందకు దింపి సరి చేసి మళ్లీ ఎగురవేశారు. అత్యంత ఘనంగా నిర్వహించాల్సిన జాతీయ వేడుకల్లో దేశ అత్యున్నత ప్రతీక అయిన త్రివర్ణ పతాకాన్ని తలకిందులుగా ఎగురవేయడం పట్ల పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా మండల కేంద్రమైన టేక్మాల్‌లోని వారి వారి కార్యాలయాల వద్ద పతాక ఆవిష్కరణ కోసం వెళ్లిన నాయకులు, ప్రముఖులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ హర్షిత కోసం ఐదు నిమిషాలు, వెలుగు కార్యలయం వద్ద ఎపియం గోపాల్ కోసం ఐదు నిమిషాలు వేచిచూశారు. విధులకు సమయ పాలన పాటించక పోవడమే కాక జాతీయపండగ దినోత్సవం సందర్భంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు ఆలస్యంగా రావడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులైన అధికారులను సర్పంచ్ నిర్లక్ష్యంవల్లే ఈ పొరపాట్లు జరుగుతున్నాయని స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమయ పాలన పాటించకుండా, విధులపట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



టేక్మాల్ జాతీయ జెండా తలకిందులుగా ఎగిరిన దృశ్యం

# కాంగ్రెస్ హయాంలోనే ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి

### మంత్రి దామోదర్ రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఉత్తమకుమార్‌రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 15, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి చెందిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం సంగారెడ్డిలో నిర్వహించిన స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 1980లో మెదక్ జిల్లా ప్రజలు ఇందిరాగాంధీకి బ్రహ్మరథంపట్టారని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు పునాది పడిందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించడంలో ఇందిరాగాంధీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మహిళా సాధికారతలో భాగంగా కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రిని మంత్రి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ముందుకు సాగిందని, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. తెలంగాణను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేయాలన్న దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోతుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు అందించేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. రాష్ట్రంలో 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు 1.06 కోట్ల రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డులోని ప్రతి కుటుంబ సభ్యునికి నెలకు 6 కిలోల చొప్పున ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. రేషన్‌కార్డు మంజూరు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నధాన్యం పండించే రైతులను ప్రోత్సహించేందుకు బోనస్ అందిస్తున్నామన్నారు. తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్నధాన్యానికి బోనస్ చెల్లిస్తూ రైతులను ఆదుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు. టామ్‌టామ్ వంటి సంస్థల ద్వారా నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, శాసనసభ్యులు సంజీవరెడ్డి, నవీన్ యాదవ్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్‌రెడ్డి, నిర్మల జగ్గారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




ఎల్లుపేటలో తెరుచుకున్న బోజనశాల

'వార్త' ప్రభావం

## ఎల్లుపేటలో తెరుచుకున్న పాఠశాలలో భోజనశాల

**టేక్మాల్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ఈనెల 14వ తేదీన వెలువడిన 'వార్త' దినపత్రికలో 'నిర్మాణం పూర్తయిన తెరుచుకోని పాఠశాలలో భోజనశాల..! బిల్లులు రాలేదనే సాకుతో కాంట్రాక్టర్ యథేచ్ఛగా వాడుకుంటున్న వైనం..!!' శీర్షికతో వెలువడిన 'వార్త' కథనానికి స్పందన లభించింది. కాంట్రాక్టర్ భోజనశాల గది తాళాలను ఓ వ్యక్తితో ద్వారా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌కు అప్పగించినట్లు ఆయన చెప్పారు. ఈమేరకు గ్రామస్తుల సమక్షంలో భోజనశాలను తెరుచుకుంది. రూ.16 లక్షల నిధులు మంజూరు చేసి నూతన భోజనశాల(వంటశాల) నిర్మాణాన్ని చేపట్టింది. భవన నిర్మాణం పూర్తయినప్పటికీ, ఏడాది గడుస్తున్నా నేటికి విద్యార్థులకు అందుబాటులోకి రాలేదు. కాంట్రాక్టర్ ఏకపక్ష ధోరణి ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు ఇంకా జమ కాలేదనే నెపంతో, ఆ కాంట్రాక్టర్ భవనాన్ని వ్యక్తిగత సామాగ్రి నిల్వ చేసుకునేందుకు వాడుకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్త కథనంతో విద్యార్థుల సమస్య పరిష్కరమైందని ఉపాధ్యాయులు అన్నారు. ఈ మేరకు వార్త యాజమాన్యానికి వార్త ప్రతినిధికి నాయకులు, గ్రామస్తులు, పాఠకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేష్ నాయక్‌ను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

## ఉరేష్‌నాయక్ ముందస్తు అరెస్ట్

**కంది, ఆగస్టు 15, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి సంగారెడ్డి పర్యటనను పురస్కరించుకుని టిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులో భాగంగా కంది తండాకు చెందిన మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ సురేష్‌నాయక్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు ఠాణాకు తరలించారు. శనివారం ఉదయం 6 గంటలకు పోలీసులు సురేష్‌నాయక్ ఇంటికి చేరుకుని పోలీసు వాహనంలో సంగారెడ్డి రూరల్ పోలీసు ఠాణాకు తరలించారు. ముఖ్యమంత్రి సభ ముగిసాక సాయంత్రం 6 గంటలకు సురేష్ నాయక్‌ను పోలీసులు వేదిలేశారు. అక్రమ అరెస్టులు తగవని సురేష్‌నాయక్ హెచ్చరించారు.

## ఆటో ఢీకొని యువకుడి మృతి

**నాగల్‌గిద్ద, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ఆటో ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గూడూర్ గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ రవికుమార్ కథనం ప్రకారం… గూడూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులుసాగర్(21) ఉపాధ్యాయురాలిని మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో దింపి తన స్వగ్రామమైన గూడూర్‌కు వస్తున్న క్రమంలో గూడూర్ నుంచి నాగల్‌గిద్ద వెళుతున్న ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో గాయపడిని ఆంజనేయులు సాగర్‌ను చికిత్సనిమిత్తం నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆప్పటికి మృతి చెందినట్లు డాక్టర్లు దృవీకరించారన్నారు. మృతుడి తండ్రి మాణిక్‌సాగర్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవికుమార్ వివరించారు.

## బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

**రామచంద్రాపురం ఆగస్టు 15 ప్రభాతవార్త :** దేవాలయ ప్రాంగణంలో మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆరోపణలపై 66 ఏళ్ల వ్యక్తిని రామచంద్రాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. 13 082026న రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని ఓ దేవాలయంలో పనిచేస్తున్న వడ్ల సాయన్న అలియాస్ సైలూ అనే వ్యక్తి మైనర్ బాలికతో దేవాలయంలో అసభ్యకర రీతిలో ఉన్నట్లు కొందరు శ్రీనివాస్‌నగర్ కాలనీ వాసులు గమనించారు. ఈ విషయంపై 14082026న రామచంద్రాపురం పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది అని తెలిపారు. దర్యాప్తులో భాగంగా నిందితుడిగా గుర్తించిన వడ్ల సాయన్న అలియాస్ సైలూ (66), శ్రీనివాస్‌నగర్ కాలనీ, రామచంద్రాపురం నివాసిని పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో బాధితురాలు 18 సంవత్సరాల లోపు మైనర్ బాలిక కావడంతో ఆమె గోప్యత, వ్యక్తిగత హక్కులను కాపాడటం అత్యంత ముఖ్యమని పోలీసులు స్పష్టం చేశారు.

# వీరుల త్యాగమే మన స్వేచ్ఛకు పునాది

### స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న మంత్రి, కలెక్టర్, సిపి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగమే మన స్వేచ్ఛకు పునాది అని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీపీ కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలలో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. ప్రజాపాలన, పారదర్శక పాలనలో స్వేచ్ఛా, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రాణాళిక రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి వారు సద్వినియోగం చేసుకునేలా గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన కల్పించడానికి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను నిర్వహించామన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండని విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వరిపంటకు బదులు తక్కువ నీటి వినియోగం తక్కువ కాలంలో పూర్తయ్యే ఆరు తడి పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక పథకాలను అమలు చేస్తుందన్నారు.

విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు లేకుండా ఏడాది రూ.2300 కోట్లు ముందే విద్యార్థుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని సిఎం చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. చేయూత పింఛన్ పథకంలో భాగంగా కొత్తగా 2.50 లక్షల మందికి పింఛన్లు అందించడం జరుగుతుందని తెలిపారు. యువత నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉద్యోగ కల్పన పెంచడానికి నియోజకవర్గానికి ఒక ఏటిసి మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, సీపీ రష్మీపెరుమాళ్, డిఆర్వో నాగరాజమ్మ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం, పద్మాశాలి కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), వివిధశాఖల అధికారులు, ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమర యోధులను మంత్రి చేతుమీదుగా ఘనంగా సత్కరించారు. వివిధశాఖలు ప్రగతిని తెలుపుతూ ఏర్పాటు చేసిన స్టాల్స్, శకటాలను ఆయన తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు చూపరులను అకట్టుకున్నాయి.

# సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

### మంత్రి వివేక్ వెంకటస్వామి



జాతీయ జెండాను ఎగుర వేస్తునా మంత్రి వివేక్ వెంకటస్వామి దృశ్యం

**మెదక్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ప్రాంగణానికి చేరుకున్న వివేక్ వెంకటస్వామి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎస్పీ డివి శ్రీనివాస రావు, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రత్యేక శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశానికి స్వాతంత్రం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. వారి పోరాటాలు, త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యత నిస్తూ, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ తెలంగాణను విశ్వవేదికపై సగర్వంగా నిలబెట్టేందుకు కృషి చేస్తోందని తెలిపారు. భూ భారతి ద్వారా భూ సమస్యలపరిష్కారం భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విచ్చేసిన స్వాతంత్ర్య సమర యోధులకు, ప్రజాప్రతినిధులకు, పురప్రముఖులకు, ప్రజలకు, అధికారులకు, విద్యార్థినీ, విద్యార్థులకు, పాత్రికేయులకు హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్, సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో ఎందరో మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్రం సాధించుకున్నాం. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆధ్వర్యంలో రూపొందించబడిన రాజ్యాంగం మన దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచేలాచేసింది. మన ఆకాంక్షలను అర్థం చేసుకొని, సమస్యలను పరిష్కరించే ప్రజాస్వామ్య భారత దేశాన్ని రూపొందించుకున్నామని వివరించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పోరాటాలు చేసిన తెలంగాణ వీరు లకు జేజేలు పలుకుతూ, ఈ పోరాటంలో ప్రాణాలు త్యాగం చేసిన తెలంగాణ అమర వీరులకు ఘన మైన నివాళులర్పిస్తున్నానని తెలిపారు. రాష్ట్రాన్ని భారతదేశంలోనేగాక, ప్రపంచ స్థాయిలో అగ్ర స్థానంలో నిలిపేందుకు సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 2 మెప్మా 202627 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 134 సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 18 కోట్ల 27 లక్షల రూపాయల రుణాన్ని మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని వనదుర్గా అమ్మవారి ఏడుపాయల ఆలయంలో వసతిగృహాల ఏర్పాటుకు టూరిజంశాఖ ద్వారా 7 కోట్ల రూపాయలు, మెదక్ పోర్ట్ పునరుద్ధరణకు 57 లక్షలు రూపాయలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మెదక్ జిల్లాలో టూరిజం డెవలప్‌మెంట్ కమిటీని ఎర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి మెదక్ జిల్లాలోని ప్రతి పౌరులు, అధికారులు, సిబ్బంది, మీడియా మిత్రులు సహకారంతో మరియు ప్రత్యేక అధికారి శ్రీమతి ఎ.వాణిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం విజయవంతం కావడం విశేషంగా వెల్లడించారు. చివరిగా మెప్మ అధ్యర్యంలో రూ. 3.5 కోట్ల జంబో చెక్కును లబ్దిదారులకు అందించి, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికను అందించారు. స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలకు సన్మానించడం జరిగింది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి విజయవంతం చేస్తున్న అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదరపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, డీఎస్పీ ప్రసన్న కుమార్, ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు పుర ప్రముఖులు మీడియా మిత్రులు హాజరయ్యారు.



సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## ఏడాకులపల్లి సొసైటీ భవనం ప్రారంభం

**ఝరాసంగం, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ప్రజలకు సేవ చేయాలనే సంకల్ప బలం ఉంటే క్లిష్టమైన వ్యవస్థలనైనా అభివృద్ధి పథంలో నడిపించ వచ్చని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ నిరూపించారని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మండల పరిధిలోని చీలమామిడి పంచాయితీ పరిధిలోని అంనతసాగర్ శివారులో 30 లక్షల వ్యయంతో నిర్మించిన ఏడాకులపల్లి సొసైటీ భవనాన్ని ఎమ్మెల్యే శివకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ గతంలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఏడాకులపల్లి సొసైటీతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్‌ను లాభాల బాటలో పయనించేలా శివకుమార్ చేసిన కృషి అభినందనీయమన్నారు. అనేక మందికి ఉపాధి అశకాశాలు కల్పించిన ఘనత శివకుమార్‌కే దక్కుతుందన్నారు. రైతుల అవసరాలను గుర్తించి వారికి సహకారం అందించడంతో సంస్థలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు వెంకటేశం, కేతకి ఆలయ కమిటి చైర్మన్‌లు నరసింహారెడ్డి, నీల వెంకటేశం, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు గుండప్ప, విజయకుమార్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఝరాసంగం, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ఈనెల 16వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా మండలంలోని జీర్లపల్లి, బోడగామా, బొప్పనా పల్లి, ప్యాలవరం, గుంతమర్పల్లి, జొనగామా, నర్సాపూర్, కమాల్‌పల్లి, కప్పాడ్, చిన్నసంగం, ఏడాకులపల్లి, చీలమామిడి, అనంతసాగర్, ఇస్లాం పూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ సరళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ అధికారులకు విద్యుత్ వినియోగదారులు తమ వంతు సహకారం అందించాలని ఏఈఓ సరళ వినతి తచేశారు.

## విద్యార్థులకు కుల దృవీకరణ పత్రాల పంపిణీ



విద్యార్థులకు కుల దృవీకరణ పత్రాలు అందచేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

**సిర్గాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆదేశాల మేరకు కుల దృవీకరణ పత్రాలు అందచేసినట్లు తహసీల్దార్ కిరణ్, ఎంఈఓ నాగారం శ్రీనివాస్‌లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు సునీతమ్మ ఉద్యోగ మిత్ర యాప్

### ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**నర్సాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం సునీతమ్మ ఉద్యోగమిత్ర యాప్‌ను రూపొందించినట్లు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వెల్లడించారు. శనివారం స్వర్గీయ వాకిటి లక్ష్మారెడ్డి 27వ వర్ధంతి వేడుకలను లయన్స్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి లక్ష్మారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సాయి కృష్ణ గార్డెన్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి కార్యకర్తలతో పాటు ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నహీం ఉద్దిన్, కౌన్సిలర్ లు బుల్లెట్ రాజు, మొయిజుద్దీన్, మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు పంబల బిక్షపతి, సీనియర్ నాయకులు సత్యం గౌడ్, రింగుల ప్రసాద్, జ్ఞానేశ్వర్ గుప్తా, నాగరాజు గౌడ్, శ్రవణ్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ వెంకటస్వామి కలిసిన సర్పంచ్

**వెల్దుర్తి, ఆగస్టు 15, ప్రభాతవార్త :** తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తిలోని ఏర్పాటు చేయాలంటూ కోరుతూ మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా. పాఠశాలను ఇతర ప్రాంతానికి తరలించకుండా వెల్దుర్తిలోని కొనసాగించాలంటూ స్థానిక సర్పంచ్ ఆదర్శ్. మంత్రి వివేక్ వెంకట స్వామికి తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి. హస్తల్పూర్ సర్పంచ్ నరసింహారెడ్డి గ్రామ యువకులు శేఖర్ గౌడ్. చందు. ముకుంద. నవీన్ పటేల్. మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, పలువురు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 15, ప్రభాతవార్త**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసు సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మాతృభూమి కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి సాధించిన స్వాతంత్ర్యాన్ని స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వేచ్ఛను, భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్పీ తెలిపారు. దేశ భద్రతలో సరిహద్దుతో పాటు అంతర్గత భద్రతా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా తమ విధులను నిబద్ధతతో, అంకితభావంతో, నిజాయితీగా నిర్వర్తిస్తే సరిహద్దుల్లో సేవలందిస్తున్న సైనికుల త్యాగాలకు సమానంగా మన సేవలు నిలుస్తాయని గుర్తుచేశారు. పోలీసు సిబ్బంది కూడా అదే ధృఢ సంకల్పంతో ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, ఎఆర్. డిఎస్పీ ఎ.నరేందర్, యస్.బి. ఇన్స్పెక్టర్స్ సదా నాగరాజు, డి.సి.ఆర్.బి. ఇన్స్పెక్టర్ రమేష్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి ఆర్.ఐ. లు సురేష్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, యస్.బి., డి.సి.ఆర్.బి. యస్.ఐ. లు, సిబ్బంది పాల్గొన్నారు.




జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ



మనూర్‌లో జండాను ఆవిష్కరిస్తున్న అధికారులు



ఝరాసంగంలో ఎంపిడిఓ కార్యాలయంపై...



కంది సొసైటీలో...



న్యాల్‌కల్‌లో రెవిన్యూ కార్యాలయం ఎదుట....



సిర్గాపూర్‌లో సొసైటీ చైర్మన్ వెంకట్రాములు



ఏస్గి గ్రామంలో జాతీయ జండాను...



జోగిపేట మున్సిపాలిటీ కార్యాలయంలో...



బుదేరాలో

# ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

**మనూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండలంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తహసల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ విష్ణుసాగర్, పోలీసుఠాణావద్ద ఎస్ఐ కోటేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయంపై ఇన్‌చార్జి ఎంపిడిఓ హైమద్ హుస్సేన్, ఎమ్మార్సీ వద్ద ఎంఈఓ శెట్కార్ రాజశేఖర్, వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద మండల వ్యవసాయ అధికారి మహేష్‌చౌహాన్, జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ స్టాలిన్, పంచాయతీల వద్ద ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గంపలి రమ్య సిద్దారెడ్డి, ఇందిరరాగాంధీ చౌక్ వద్ద రాఘవాచారి జోషి, దోసపల్లి గ్రామపంచాయితీ వద్ద సర్పంచ్ ఫోరం అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ బిరదార్ దత్తులు జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంపల సిద్దారెడ్డి, మన్నన్ దశరథ్, సంతోష్ పాల్గొన్నారు.

**ఝరాసంగం మండలంలో**

**ఝరాసంగం, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండలం శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిడిఓ మంజుల, తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్‌రాజు, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు హనుమంతరావు పాటిల్, గ్రామ సర్పంచ్ వినోద బాలరాజ్ బిజెపి మండల అధ్యక్షులు బంటు విశ్వనాథ్, మాజీసర్పంచ్ జగదీశ్వర్, రాజేష్, ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

**కంది మండలంలో...**

**కంది, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కందితో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, గ్రామ పంచాయతీల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ దొడ్ల ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఆసియా బేగం, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్, శేఖర్ తదితరలు పాల్గొన్నారు.

**న్యాల్‌కల్ మండలంలో...**

**న్యాల్‌కల్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండలంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, పంచాయితీ కార్యాలయాలను అందంగా ముస్తాబు చేసుకుని జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ప్రభులు, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపిడిఓ షా గుప్తా ఇప్పాత్, ఆయా శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

**సిర్గాపూర్ మండలంలో...**

**సిర్గాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండలంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సొసైటీ కార్యాలయంపై బొక్కస్‌గావ్ గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ జి.వెంకట్రాములు, సొసైటీ డైరెక్టర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**నాగల్‌గిద్ద మండలంలో...**

**నాగల్‌గిద్ద, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండలంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, పంచాయితీ కార్యాలయాల వద్ద అధికారులు, సర్పంచ్‌లు, ప్రధానోపాధ్యాయులు జాతీయ జండాలను ఆవిష్కరించి వేడుకలను వేడుకగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులు చూడచక్కని దుస్తులు ధరించి నిర్వహించి జాతీయ గీతాలను ఆలపిస్తూ నిర్వహించిన ప్రభాతబేరి ఆకట్టుకుంది.

**జోగిపేటలో...**

**జోగిపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం జోగిపేటలో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు పలు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కాగా అందోలు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కార్యకర్తలతో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. అందోలు–జోగిపేట మున్సిపాలిటీలో చైర్మన్ ఎస్.క్రిష్ణారెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ ఎం.జన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో రాజేశ్‌కుమార్, ట్రాన్స్‌కో డిఇ కార్యాలయలో డిఇ శ్రీనివాస్, జోగిపేట మున్సిఫ్‌కోర్టులో మెజిస్ట్రేట్ మహ్మద్ అసదుల్లా షరీఫ్, జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గిరి శ్రీకాంత్, జోగిపేట చేనేత సంఘంలో చైర్మెన్ పడిగె సత్యం, గొల్ల కురుమ పారిశ్రామిక సహకార సంఘంలో చైర్మెన్ రొడ్డె కిష్టయ్యలు జాతీయ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు బి.శివరాజ్, బిజెపి ఆధ్వర్యంలో జోగినాథ చౌరస్తాలో మండల పార్టీ అధ్యక్షులు మహేష్కర్ సుమన్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. కాగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. అన్ని గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో సర్పంచులు జాతీయ జెండాను ఎగురవేశారు.

**మండల పరిషత్ కార్యాలయంలో...**

**సిర్గాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని ఎంపిడిఓ అండాలమ్మ జాతీయ జండాను ఆవిష్కరించారు. రైతువేదిక వద్ద మండల వ్యవసాయ అధికారి హరికృష్ణజాతీయ జండాను ఎగురేశారు. అధికారులు, సిబ్బంది జాతీయ గీతాన్ని ఆలపించి వేడుకలను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు.

**పోలీసు ఠాణాలపై...**

**సిర్గాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని పోలీసు ఠాణాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం ఎస్ఐ మహేష్ జాతీయ జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**మునిపల్లి మండలంలో...**

**మునిపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త :** మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రంగారావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ, మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ భీంసింగ్, తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ మల్లిక, హాస్టల్‌లో డబ్ల్యూహెచ్ఓ రామప్ప, బుదేరా గ్రామ పంచాయతీలో సర్పంచ్ కోలుకుందే మల్లేష్‌యాదవ్, బుసారెడ్డిపల్లి, చీలపల్లి, అల్లాపూర్, కంకోల్, ఖమ్మంపల్లి, ఇబ్రహీంపూర్, పెద్దగోప్లారం గ్రామ పంచాయతీ కార్యాలయాల ముందు ఆయా సర్పంచులు రేణుకవెంకట్రాములు, విజయలక్ష్మి, వీరన్నపాటిల్, గుజ్జరీ పాండు, ల్యగల అశోక్, బుద్ద మల్లేశంలు త్రివర్ణ పతాకాలను ఎగుర వేశారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో రామకృష్ణ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, కోర్టు వద్ద జూనియర్ సివిల్ జడ్జి హేమలత, తాసిల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ శ్రీనివాస్, పోలీస్ స్టేషన్లో సీఐ రంగకృష్ణ, ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద డాక్టర్ ఎడి జనార్దన్, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ లక్ష్మి, ఎక్సైజ్ కార్యాలయం వద్ద సిఐ గులాబ్ ముస్తఫా, శ్రీరామ్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే సునీతరెడ్డి, అటవీశాఖ అధికారి కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ దివ్య, వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఏడిఏ సంధ్యారాణి ఏఓ దీపిక. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, నర్సాపూర్ గాంధీ విగ్రహం వద్ద గౌడ సంఘం నాయకులు, బిజెపి కార్యాలయ బిజెపినాయకులు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్, ఐసిడిఎస్ కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో పలు ప్రభుత్వ శాఖల వద్ద అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ మాజీకో ఆప్షన్ మెంబర్ మన్సూర్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు మురళి యాదవ్, అశోక్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బుచ్చేష్ యాదవ్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నహీం ఉద్దిన్, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు బిక్షపతి, నాయకులు సత్యం గౌడ్, జ్ఞానేశ్వర్, ఆనంద్, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

**అచ్చంపేటలో...**

**నర్సాపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి. ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నవీన్, పంచాయతీ కార్యదర్శి శ్రావణి సింధుజ.వార్డు సభ్యులు ఆంజనేయులు కృష్ణ ప్రవీణ్ నర్సమ్మ వరమ్మ పార్వతమ్మ గ్రామ పెద్దలు శ్రీనివాస్ గోవర్ధన్ నర్సయ్య సాయిలు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**వెల్దుర్తి ఉమ్మడి మండలంలో...**

**వెల్దుర్తి, ఆగస్టు 15. ప్రభాతవార్త :** ఉమ్మడి మండల వ్యాప్తంగా శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రవేట్. యువజన సంఘాల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ విజయలక్ష్మి. ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల ప్రత్యేక అధికారి రాకేష్. స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై కరుణాకర్ రెడ్డి. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపల్ శ్రీనివాస్. ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓ బుచ్చా నాయక్. వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో ఝాన్సీ. త్రివర్ణ పథకాన్ని ఎగరవేశారు. అలాగే స్థానిక సబ్ స్టేషన్ వద్ద ఏఈ పెంటియానాయక్. పి హెచ్ సి వద్ద డాక్టర్ శిరీష. జడ్‌పిహెచ్ఎస్‌వద్ద హెచ్ఎం సాంబయ్య, ఈజీఎస్ కార్యాలయం వద్ద విగ్నేశ్వర్. పంచాయతీల వద్ద సర్పంచులు త్రివర్ణ పథకాన్ని ఎగురవేశారు. అనంతరం మహనీయుల సేవలను వారు కొనియాడారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై కరుణాకర్ రెడ్డి విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాలలో పదవ తరగతి లో ప్రథమ ద్వితీయ తృతీయ మండల టాపర్లకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు అధికారులు ప్రజా ప్రతినిధులు. యువకులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ప్రభుత్వ పాలన లక్ష్యం

### మంత్రి దామోదర రాజనర్సింహ

***సంగారెడ్డి బ్యూరో ఆగస్టు 15, ప్రభాతవార్త***

నెహ్రూ, ఇందిరమ్మ అందించిన సంక్షేమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

అనంతరం మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్రం లభించిందని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు తదితర వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.225 కోట్ల విలువైన రుణాల చెక్కును మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు, చిన్నతరహా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షి ంచారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




పోలీసు గౌరవ వందనాలు స్వీకరిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

## వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

**జగదేవ్‌పూర్, ఆగస్టు 15 (ప్రభాతవార్త):**

మండలపరిధిలోని చాట్లపల్లి గ్రామంలో యువకులను క్రీడల వైపు మళ్లించేందుకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి కావ్య దర్గయ్య మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలవైపు దృష్టి సారించినట్లయితే మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వర్కోళ్ల రజిత సత్యనారాయణ, బరిగె కవిత కనకయ్య, కాంగ్రెస్ నాయకులు బరిగె నర్సింలు ముదిరాజ్, క్రీడాకారులు కొంతం శ్రీకాంత్, బరిగె శ్రీను, వేముల శ్రీకాంత్, బరిగె తిరుపతి, చిలుముల చందు, కొండ స్వామి, పంజాల సాయికుమార్, బరిగె క్రాంతికుమార్ పాల్గొన్నారు.



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

## ఎన్నికల హామీలను అమలు చేస్తున్న సర్పంచ్

**మనూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** పంచాయితీ ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి హామిని సర్పంచ్ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నారు. మండల పరిధిలోని దోసపల్లి గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బిరాదర్‌దత్తు 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన బిరదర్ అక్షిత శ్రీకాంత్ దంపతులకు ఆడపిల్ల జన్మ ఇవ్వడంతో దంపతులకు శాలువాలతో సన్మానించి 5100 నగదు ప్రోత్సాహకాన్ని దంపతులకు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి బాలు, ఉప సర్పంచ్ ప్రభాకర్, గ్రామస్థులు అశోక్ డీలర్,, కుశప్ప, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**పుల్కల్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన కుమ్మరి లక్ష్మమ్మ మృతి చెందగా సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో ఎలాంటి శుభ, అశుభ కార్యాలు జరిగినప్పటికీ సర్పంచ్ సొంత నిధులతో ముందుకు వచ్చి ఆదుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తాము ఇచ్చిన హామీలన్నీ ఇప్పటికే నెరవేర్చడం జరిగిందని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి : సర్పంచ్

**పుల్కల్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** పుల్కల్, మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో మండల స్థాయిలో రెండవ స్థానం సాధించిన విద్యార్థిని సాయి వర్షినిని గ్రామ సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా శనివారం ఆమె విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని విద్యను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి ఏటా పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచే విద్యార్థులకు 5 వేల రూపాయల నగదు బహుమతిని అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. గ్రామంలోని చిన్నారులందరూ తప్పకుండా బడికి వెళ్లాలని, అది కూడా ప్రభుత్వ పాఠశాల అయి ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, ఇక్కడ చదువుకున్న వారికి భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తాయని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి రికార్డులతో అధికారులు హాజరు కావాలి

**న్యాల్‌కల్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ప్రతి సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి విధిగా హాజరుకావాలని మండల అభివృద్ధి అధికారి షా గుప్తా ఇఫ్ఫాత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఉత్తమ వైద్యునిగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ రమేష్ రెడ్డి

## ఉత్తమ వైద్యుడిగా డాక్టర్ రమేష్‌రెడ్డికి ప్రశంసా పురస్కారం

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌రెడ్డికి జిల్లా ఉత్తమ వైద్యుడిగా ప్రశంసా పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతి చేతులమీదుగా డాక్టర్ రమేష్‌రెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలను మెరుగు పరచడంతోపాటు, రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్ రమేష్‌రెడ్డి చేస్తున్న కృషిని గుర్తించి ఈ ప్రశంసా పురస్కారం అందజేశారు.

## వినూత్న డ్రై హెలీ శకటానికి పురస్కారం



మంత్రినుంచి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణలో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న హుస్నాబాద్ మున్సిపాలిటీకి మరో ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమాల్లో హుస్నాబాద్ మున్సిపాలిటీ రూపొందించిన డ్రై హెలీ శకటానికి ప్రత్యేక పురస్కారం దక్కింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, డ్రై వేస్ట్ సేకరణను ప్రోత్సహించడం, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం లక్ష్యంగా రూపొందించిన డ్రై హెలీ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అవార్డును రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రవికుమార్, జవాన్ శ్రీకాంత్, సిబ్బంది కిరణ్, సురేష్, రాజు అందుకున్నారు.

## ఎస్‌ఐ మానసకు ప్రశంసా పురస్కారం



మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మానస

**రాయపోల్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** రాయపోల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ మానస విధి నిర్వహణలో చూపుతున్న ప్రతిభ, ప్రజలకు అందిస్తున్న సేవలకు గాను మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హైమవతి, పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రశంసలు అందుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సిద్దిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన అధికారులను సన్మానించగా రాయపోల్ ఎస్‌ఐ మానసకు ప్రత్యేక అభినందనలు అభించాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా ఎస్‌ఐ మానసకు ప్రశంసాపత్రం అందజేసారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలతో సత్సంబంధాలు, సమర్థవంతమైన పోలిసింగ్, మహిళల భద్రత, ప్రజాసమస్యల పరిష్కారంలో చూపిన కృషిని ఉన్నతాధికారులు కొనియాడారు.

## లైన్‌మెన్ సురేష్‌కు ఉత్తమ సేవా అవార్డు




జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ నుండి అవార్డు అందుకుంటున్న సురేష్

**కొల్చారం, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్ ప్రజలకు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్, ఎమ్మెల్యే రోహిత్ లైన్మెన్ సురేష్‌కు ఉత్తమ సేవా అవార్డును అందజేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ విధి నిర్వహణలో చూపిన అంకితభావానికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సురేష్‌ను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు అభినందించారు.

### వెయ్యి కోట్లు ఇచ్చినా

# జగ్గారెడ్డిలాంటి నాయకుడు దొరకడు

## సంగారెడ్డి సభలో సిఎం రేవంత్ రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 15 ప్రభాతవార్త :**

సంగారెడ్డిలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ రాముడు ఐతే.. ఆయన భక్తుడు హనుమంతుడు జగ్గారెడ్డి అని అన్నారు. రాముడు ఏం ఆదేశిస్తే... హనుమంతుడు అది పాటించాల్సి ఉంటుందన్నారు. జగ్గారెడ్డి ఎక్కడ పోటీ చేయాలో రాహుల్ గాంధీ చెప్తారు. జగ్గారెడ్డి లాంటి ప్రజా నాయకుడు అవసరం ఎంతైనా ఉందని అన్నారు. జగ్గారెడ్డి నీ ఓడగొట్టుకున్న దురదృష్టవంతులు మీరేనని, జగ్గారెడ్డిలాంటి నాయకుడి ఉన్నందుకు అదృష్టవంతులు కూడా మీరేనని అన్నారు. వెయ్యి కోట్లు ఇచ్చినా ఇలాంటి నాయకుడు దొరకడు దొరకడని అన్నారు.



మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి



సిద్దిపేటలో జెండా వందనం చేస్తున్న దరిపల్లి చంద్రం



కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో...



చేర్యాలలో జెండా ఎగురవేస్తున్న సిఐ రమేష్ నాయక్



కొత్తపల్లిలో సర్పంచ్ శ్యామలమల్లేశం...



జగదేవ్‌పూర్ ఎంపిడివో కార్యాలయం వద్ద అధికారులు..



మర్కుక్‌లో సాయిని మహేష్..



ములుగులో అధికారులు, ప్రజాప్రతినిధులు



వర్గల్‌లో జెండా వందనం చేస్తున్న దృశ్యం

# వీధి వీధినా మువ్వన్నెల జెండా రెపరెపలు

**సిద్దిపేట అర్బన్/కొమురవెల్లి/చిన్నకోడూరు/నంగునూర్/బెజ్జంకి/తొగుట, ఆగస్టు 15, ప్రభాతవార్త**

సిద్దిపేట జిల్లాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని గ్రామాల్లో, పట్టణాలలో వీధివీధినా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ హైమావతి పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. సీపీ కార్యాలయం ఎదుట సీపీ రష్మి పెరుమాళ్, మున్సిపల్ కార్యాలయంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆర్డీఓ సదానందం జెండాలను ఆవిష్కరించారు. అలాగే సిద్దిపేట వాసవీ, వాసవీవనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిటిజన్ క్లబ్‌లో అధ్యక్షుడు రమేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. చేనేత సహకార సంఘం వద్ద అధ్యక్షులు చీర్లంచి జనార్ధన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుండు రాధాకిషన్, కాల్వ సుధాకర్, చేర్యాల ప్రభాకర్, నగేష్, రవితేజ, శ్రీనివాస్, ప్రీహరి, గోవర్ధన్ పాల్గొన్నారు.

### జిల్లా గ్రంథాలయంలో...

జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్ర వర్మ, పార్టీ నాయకులు సాకి అనంద్, శంకర్, మంద పాండు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో...

కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ జాతీయ జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు), బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, కలీం, అంజయ్య, గయాజుద్దీన్ పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ కార్యాలయంలో...

జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ కార్యాలయంలో...

జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్ సీపీఐ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, బన్సీలాల్, చంద్రం, మల్లేశం, హరీఫ్ పాల్గొన్నారు.

### నంగునూరులో...

మండలంలోని వివిధ గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నంగునూరులో ఎంపిపి కార్యాలయం వద్ద ఎంపిడివో, తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్, ఎంఇఓ కార్యాలయం ఎదుట ఎంఈవో, ఐకెపి కార్యాలయం ఎదుట అధ్యక్షురాలు, జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. పాలమాకుల, ముండ్రాయి, బద్దిపడగ, గట్లమల్యాల, మగ్దుంపూర్, వెల్కటూర్, నర్మెట్ట, అంక్షాపూర్, కొండంరాజ్‌పల్లి, వెంకటాపూర్ లలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

### చిన్నకోడూరులో...

చిన్నకోడూరులో మువ్వన్నెల పతాకాలు రెపరెపలాడాయి. ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎంపిడివో జనార్ధన్, తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ సలీం మియా, పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ చంద్రమోహన్, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మయ్య, గ్రామ పంచాయతీల వద్ద సర్పంచ్‌లు జెండాలను ఆవిష్కరించారు. అలాగే వివిధ కుల, యువజన సంఘాల వద్ద ఆయా సంఘాల అధ్యక్షులు జెండాలను ఆవిష్కరించారు. పిహెచ్‌సిలో డాక్టర్ ఐశ్వర్య, పశువైద్యాధికారి మంజుల, ఎఫ్‌పివో చైర్మన్ గడ్డం వెంకట్‌రెడ్డిలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

### కొమురవెల్లిలో...

మండలంలోని ఆయా గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొమురవెల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట తహశీల్దారు, పోలీసు స్టేషన్ వద్ద ఎస్‌ఐ, శ్రీమల్లికార్జున స్వామి కార్యాలయంలో ఈవో సుధాకర్‌రెడ్డి, ఎంపిపి కార్యాలయంలో ఎంపిడిఓ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్ జెండాలను ఆవిష్కరించారు. అలాగే మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీల ఎదుట సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

### బెజ్జంకిలో...

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీలలో, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు కుల సంఘాల వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీల వద్ద సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. పిఎసిఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ ఒగ్గు దామోదర్, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడివో, తహసీల్దార్ కార్యాయలంవద్ద తహసీల్దార్, పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ తోట తిరుపతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్, ఎఎంసి కార్యాలయంలో చైర్మన్ పులి కృష్ణ, వ్యవసాయ కార్యాలయంవద్ద వ్యవసాయ అధికారి, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

### తొగుటలో...

తొగుట మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపిపి కార్యాలయం వద్ద ఎంపిడివో నరసింహారెడ్డి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మహమ్మద్ సమీర్ హైమద్‌ఖాన్ జాతీయజెండాలను ఆవిష్కరించారు. ఎఎంసి కార్యాలయం ఎదుట ఎఎంసి చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొంగరి నర్సింలు, డైరెక్టర్లు చందా సత్తయ్య, సయ్యద్ అన్సర్, బైతి స్వామి, భక్కొల్ల నర్సింహ్మారెడ్డి, బుచ్చయ్య, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పంచాయతీల వద్ద సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించి గౌరవవందనం చేశారు.

### చేర్యాలలో...

**చేర్యాల, ఆగస్టు 15, ప్రభాతవార్త :** మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా వేడుకలను నిర్వహించారు. చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ముస్త్యాల అరుణ, పోలీస్ స్టేషన్ సర్కిల్ కార్యాలయంలో సిఐ బానోతు రమేష్‌నాయక్, కోర్టులో జడ్జి బానోతు శ్రీరాంనాయక్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో సుధీర్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ యార్డులో కార్యదర్శి కె.రవికుమార్, ఎక్సైజ్ కార్యాలయంలో సిఐ నరసింహులు, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ మనోహర్, రైతువేదిక వద్ద ఆత్మ కమిటీ చైర్మన్ జక్కుల తిరుపతి, తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీవాస్య సందీప్, ఆయా కార్యాలయాల ముందు అధికారులు, పార్టీల కార్యాలయాల ముందు నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు.

### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ పాత బస్టాండ్ వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మంజ మల్లేశం, కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్, వెలగల దుర్గయ్య, మాజీ కౌన్సిలర్ ఆడెపు నరేందర్, నాయకులు మంచాల చిరంజీవులు, ఆడెపు చంద్రయ్య, ఉడుముల బాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంబాల శ్రీను, యం.డి ఖాజా, అంబాల రాములుగౌడ్, చెవిటి లింగం, నాగుల వెంకటేశం, దూడెపు వెంకటేశం, కాటం మల్లేశం, సన్నీ, జహీరోద్దీన్ తదితరులు ఉన్నారు.

### బిజెపి పార్టీ ఆధ్వర్యంలో...

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు ఆధ్వర్యంలో జాతీయజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పుర్మ సంజీవరెడ్డి, కొట్టె చంద్రమౌళి, ఆవుశర్ల రవి పాల్గొన్నారు.

### హుస్నాబాద్‌లో...

**హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండాలను ఘనంగా ఆవిష్కరించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాంమూర్తి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ సొదారపు సదానందం, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ లక్ష్మారెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ పంచదార శ్రీదేవి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కరస్పాండెంట్ వేముల గణేష్, కేరళ పాఠశాలలో ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్, నవభారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రిన్సిపాల్ గంగరబోయిన రవి జెండాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నవభారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేతబట్టి విద్యార్థులు దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థుల ర్యాలీతో పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.

### రాయపోల్ మండలంలో...

**రాయపోల్, ఆగస్టు 15ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయపోల్ మండలంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయితీలు, పోలీస్‌స్టేషన్, వివిధ శాఖల కార్యాలయాల వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. రాయపోల్ మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్‌లు, ప్రజలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయజెండాను ఎగురవేసారు, కార్యక్రమంలో మండల అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### జగదేవ్‌పూర్ మండలంలో...

**జగదేవ్‌పూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ జె.కృష్ణారెడ్డి, పిఏసిఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొంపల్లి కరుణాకర్ ముదిరాజ్, మేజర్ గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపిడివో కార్యాలయం వద్ద మండల ప్రత్యేకాధికారి సుదర్శన్‌రెడ్డి, మండల సమీకృత కార్యాలయం వద్ద తహసీల్దార్ నిర్మల జాతీయ పతాకాలను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రధాన రహదారిపై చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింపజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.వేణుగోపాల్‌రెడ్డి, ఎంపివో ఖాజా మొయినొద్దీన్, మాజీ ప్రజాప్రతినిధులు కవిత శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, కాంగ్రెస్ నాయకులు దయాకర్‌రెడ్డి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

### మర్కుక్ మండలంలో...

**మర్కుక్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ సరిత, మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపిడివో విక్రమ్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌ఐ అహ్మద్ అలీ, రైతు వేదిక వద్ద ఏఓ రాము, ఎంఆర్‌సి వద్ద ఎంఈవో వెంకటరాములు, మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు మువ్వన్నెల జెండాలను ఆవిష్కరించారు. అలాగే మర్కుక్‌లోని గాంధీ విగ్రహం ఎదుట ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సాయిని మహేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పలు పాఠశాలల విద్యార్థులు మహనీయుల వేషధారణలతో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ములుగు మండలంలో...

**ములుగు, ఆగస్టు 15, ప్రభాతవార్త :** మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద చైర్మన్ విజయమోహన్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపిడివో కార్యాలయం వద్ద ఎంపిడివో మేరీస్వర్ణకుమారి, పిఏసిఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ బట్టు అంజిరెడ్డి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ రఘుపతి, శ్రీకొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వద్ద ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ దండ రాజిరెడ్డి త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించగా, ఆయా గ్రామ పంచాయతీల వద్ద సర్పంచులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌గుప్త, ఏఎంసి డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వర్గల్ మండలంలో...


**వర్గల్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్‌స్టేషన్, ప్రైవేట్ పాఠశాలల్లో, వివిధ పార్టీ కార్యాలయాలు, కార్మిక సంఘాల భవనాల వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు

## మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజాపాలన ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు చేయడం జరుగుతుందని ఇది నిరంతర ప్రక్రియ అని 365 రోజులు కొనసాగుతుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వైశ్య కన్వెన్షన్ భవనంలో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కలెక్టర్ హైమావతి, జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, పద్మాశాలి కో-ఆపరేటివ్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రంలతో కలిసి లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డిలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. గతంలో రేషన్ కార్డులు ఇచ్చిన పాపానపోలేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నూతనంగా 16 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కొరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలాలలో, గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను పండుగ వాతావరణంలో పంపిణీ చేయాలన్నారు. కొత్తగా రేషన్ కార్డు వచ్చిన కుటుంబాలు చాలా సంవత్సరాల తర్వాత తమకు రేషన్ కార్డు వచ్చిందని సంతోషాన్ని




లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి ప్రభాకర్‌గౌడ్

వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగలేకున్న పాత పథకాలు కొనసాగిస్తూనే.. కొత్త పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కొత్త పెన్షన్‌ల ప్రక్రియ ప్రారంభించిమని వికలాంగులు, వితంతు మహిళలు తదితరులు పెన్షన్‌కు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో 2.5 లక్షల కొత్త పెన్షన్‌లు మంజూరుచేయడం జరుగుతుందన్నారు. 70 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని తాజాగా ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని త్వరలోనే ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గూడు లేని నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని గొప్ప విజయానికి మార్పు అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మిగిలిపోయిన పథకాలను సైతం అమలు చేస్తామన్నారు. వర్షాలు కురువాలని సిఎం రేవంత్‌రెడ్డి వరుణయాగం చేశారని తెలిపారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంగరి నాగరాజు, రేషన్ కార్డుల లబ్దిదారులు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డిఎస్ఓ జి.తనూజ, డిఎం గోపికృష్ణ, ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, ఆర్టీఏ సభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, ఎఎంసి చైర్మన్లు యాదగిరి, మహేందర్‌యాదవ్, విజయ్‌రెడ్డి, జిల్లాలోని రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ సంగీత

## మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత

### అడిషనల్ కలెక్టర్ సంగీత

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 15, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సముదాయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సముదాయ ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్ సంగీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, ఎందరో స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని సూచించారు. ముఖ్యంగా యువత నూతన ఆలోచనలు, నైపుణ్యాలతో ముందుకు సాగుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించిన విజన్‌కు అనుగుణంగా అడుగులు వేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఆమె సూచించారు. ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న వనిత

## శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనితకు ఉత్తమ అవార్డు

**రామాయంపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రామాయంపేట మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్. వనిత ఉత్తమ అవార్డును అందుకున్నారు. పారిశుధ్య నిర్వహణలో సమర్ధవంతంగా విధులు నిర్వర్తిస్తూ మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలను సమర్ధంగా అమలు చేసినందుకు ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. మెదక్ లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ చేతుల మీదుగా ఎన్. వనిత ఉత్తమ అవార్డును అందుకున్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ, పారిశుధ్య సిబ్బంది సమన్వయం, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో ఆమె అందిస్తున్న సేవలను అధికారులు అభినందించారు. ఉత్తమ అవార్డు అందుకోవడం పట్ల మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజుతో పాటు పాలకవర్గం సభ్యులు, అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.

## ఉత్తమ ఫైర్ ఫైటర్‌గా నేరెళ్ల నరేష్




మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఫైర్ ఫైటర్ నరేష్

**రామాయంపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త :** అగ్నిమాపక శాఖలో విశిష్ట సేవలు అందిస్తున్న రామాయంపేట ఫైర్‌స్టేషన్ ఫైర్‌ఫైటర్ నేరెళ్ల నరేష్‌కు 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బెస్ట్ ఫైర్‌ఫైటర్ అవార్డు లభించింది. జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతిభాసింగ్, జిల్లా మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ చేతుల మీదుగా నరేష్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఫైర్‌స్టేషన్ పరిధిలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, అత్యవసర సమయాల్లో సమర్ధవంతంగా సేవలందించినందుకు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. నరేష్‌కు అవార్డు లభించడంపై సహచర సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

## దైవ సన్నిధిలో మనసిక ప్రశాంతత : మాజీ ఎమ్మెల్యే

**చిన్నశంకరంపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దైవ సన్నిధి మనుసుకు ప్రశాంతత నిస్తుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం మండల పరిధి అంబాజీపేటలో రజకసంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మడివేలి మాచయ్య, శీలాలమ్మ, ఈదమ్మ దేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు హనుమంతరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, సర్పంచి సుంకరి సబితాగౌడ్, మాజీ జడ్పీటీసీ పోతరాజు రమణ, నాయకులు రాజిరెడ్డి, కంజర్ల చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, శ్రీమన్నారాయణ రెడ్డి, సాన సత్యనారాయణ, రవిగౌడ్, రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

## బిజెవైఎం మండల అధ్యక్షుడిగా మధు

**చిన్నశంకరంపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త:** బీజేవైఎం మండలాధ్యక్షునిగా సంద్రు మధుని నియమించినట్లు బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు తెలిపారు. ఈ మెరకు నియామక పత్రాన్ని అందించారు. మధు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని బాధ్యతలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగాపనిచేస్తానని ఆయన తెలిపారు.

## వాడవాడలా ఎగిరిన జాతీయ జెండా

**అమీన్‌పూర్ ఆగస్టు 15 ప్రభాతవార్త :** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని.. అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి జెండాను ఎగురవేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలలు, కాలనీలలో ఏర్పాటు చేసిన జాతీయ జెండా ఆవిష్కరణలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్. మాజీ కౌన్సిలర్స్, సీనియర్ నాయకులు, యువ నాయకులు తుమ్మల రుశ్వంత్ రెడ్డి ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### సదాశివపేటలో...

**సదాశివపేట, ఆగస్టు 15 (ప్రభాతవార్త) :** సదాశివపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గాంధీచౌక్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు, తృతీయ రూ.2 వేల చొప్పున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

### టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో...

సదాశివపేట ఆగస్టు 15 ప్రభాతవార్త : 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అధ్యక్షులు దొడ్ల వెంకట్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో మహానీయుల త్యాగఫలమే మన అనుభవిస్తున్న స్వాతంత్రం అని, మహనీయులను ప్రతిరోజు స్మరించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఎఫ్ జిల్లా నాయకులు నవీన్, మాజీ సర్పంచ్ విఠల్, మాజీ ఎంపిటిసి నాగేష్‌లు జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొని వందనం చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్, రాజు, మహిపాల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి జిల్లా కార్యాలయంలో...

**మెదక్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** మెదక్ బిజెపిజిల్లా అధ్యక్షుల వాల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలందరికీ భారతీయ జనతా పార్టీ జిల్లా తరపున 80వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఎందరో మహనీయులు స్వాతంత్ర్య కోసం పోరాటం చేసి అమరులైతే నేడు స్వతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నాం కాబట్టి ఆ మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిది. భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు గల్లి నుండి ఢిల్లీ వరకు మువ్వనేల జెండాను ఎగరవేసి గొప్పతని చాటి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు జిల్లా పదధికారులు జిల్లా మోర్చాల అధ్యక్షులు కౌన్సిలర్లు సర్పంచ్లు మండల పట్టణ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## సీఎం సభకు తరలిన 12వ వార్డు ప్రజలు

**సదాశివపేట ఆగస్టు 15 ప్రభాతవార్త :**

సదాశివపేట పట్టణం 12వ వార్డు నుంచి కౌన్సిలర్ పులిమామిడి మమత ఆధ్వర్యంలో ప్రజలు భారీ సంఖ్యలో సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు తరలివెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని మమత తెలిపారు. వార్డు ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మోహిజ్, రాము, సోమ శంకర్, నర్సింలు, క్రిష్ణ, సునిల్, పాశ, శ్రీనివాస్, రాములు, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



టేక్మాల్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న దృశ్యం



చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయం ముందు



శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట...



రామాయంపేటలో తహశీల్దార్ రజని కుమారి...




జాతీయపతాకాన్ని ఎగురవేస్తున్న లావణ్య నాగరాజు



రామాయంపేట పీఏసీఎస్ కార్యాలయం ఎదుట...



నార్సింగి ఇన్‌చార్జి ఎంపీడీవో సయీద్...



పోవన్నపేటలో సర్పంచ్ పావని...



జెండాను ఎగరవేస్తున్న నరోత్తం



సదాశివపేటలో...



క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు...

**టేక్మాల్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం టేక్మాల్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల కార్యాలయాల ముందు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ తులసిరాం, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ అరవింద్‌కుమార్, ఎంపిపి కార్యాలయం వద్ద ఎంపిడిఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యాలయంవద్ద సర్పంచ్ సుధాకర్, గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ మురళి, గాంధీభవన్ వద్ద సుధాకర్ సహకార సంఘం వద్ద చైర్మెన్ యశ్వంత్‌రెడ్డి, డిసిసిబి బ్యాంక్ వద్ద మేనేజర్ ప్రత్యుమ్న రెడ్డి, ఐకెపి కార్యాలయం వద్ద ఎపిఓ గోపాల్, వ్యవసాయ కార్యాలయంవద్ద మండల వ్యవసాయాధికారి రాంప్రసాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలవద్ద ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి, హర్షిత, మీసేవ కేంద్రం వద్ద సలీం, బస్టాండ్‌లో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు శంకర్ జాతీయ పతకాలను ఎగురువేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోనక్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### చిన్నశంకరంపేట మండలంలో...

**చిన్నశంకరంపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలో విద్యార్థులు వీధులలో ర్యాలీ నిర్వహించి జాతీయ గీతాలను ఆలపించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ మాలతి, ఎంపీడీఓ కార్యాలయం ముందు ఎంపీడీఓ దామోదర్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శివానందం, వ్యవసాయశాఖ కార్యాలయం ముందు వ్యవసాయశాఖ అధికారి లక్ష్మీప్రవీణ్, మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో దీప్లా రాథోడ్, కస్తూర్బాగాంధీ కార్యాలయం ముందు ప్రిన్సిపల్ గీతా, మండల ఆరోగ్యకేంద్రం ఎదుట వైద్యాధికారి సాయిసింధూ, ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ వాణి, జడ్పీ ఉన్నతపాఠశాలలో ఎంఈవో దీప్లా, మండల సమాఖ్య కార్యాలయం ముందు అధ్యక్షురాలు సౌజన్య, మహత్మగాంధీ జాతీయ ఉపాధీ హామి కార్యాలయం ముందు ఎంపీడీవో దామోదర్, పంచాయతీ కార్యాలయాల ముందు ఆయా గ్రామాల సర్పంచులు, ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ప్రవేటు కార్యాలయాల ముందు జెండాను ఆవిష్కరించారు.

### శివ్వంపేట మండలంలో...

**శివ్వంపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని శివ్వంపేట మండలవ్యాప్తంగా ఆయా గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, పిఎసిఎస్ కార్యాలయంవద్ద పిఎసిఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై మధుకర్‌రెడ్డి, ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓ బుచ్చ నాయక్, గ్రంథాలయం కార్యాలయంవద్ద గ్రంథాలయం అధికారి అర్చన, ప్రభుత్వ హాస్పటల్ వద్ద డాక్టర్ సాయి సౌమ్య, గూడూరు గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ బేగరి నర్సయ్య, జాతీయ జెండాను ఎగరవేశారు.

### రామాయంపేటలో...

**రామాయంపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త :** పట్టణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ రజనీకుమారి, మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, గాంధీ విగ్రహం దగ్గర మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం వద్ద సీఐ సైదా నాయక్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ బాలరాజ్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడివో సాజిలోద్దిన్, పిఎసిఎస్ కార్యాలయం వద్ద చైర్మెన్ బాదె చంద్రం, ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో శ్రీనివాస్ గుప్తా, ఐకెపి కార్యాలయం వద్ద ఏపిఎం ఇందిర, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో ప్రవీణ్‌కుమార్, ఐసిడిఎస్ కార్యాలయం వద్ద స్వరూపరాణి, పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆయా అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు పట్టణ అధ్యక్షురాలు చింతల స్వప్న స్వామి, భారతీయ జనతాపార్టీ కార్యాలయం ముందు పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యాలయం ముందు మాజీ మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ హిమజ్యోతి, మంజీరా విద్యాలయం ముందు కరస్పాండెంట్ జితేందర్ రెడ్డి, వివేకానంద విగ్రహం ముందు యూత్ క్లబ్ అధ్యక్షుడు దోమకొండ శ్రీనివాస్, శివాజీ విగ్రహం ముందు ఏబీవీపీ ప్రశాంత్‌లు జాతీయ జెండాలను ఎగరవేశారు. పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన కళా ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

### నార్సింగి మండలంలో...

**నార్సింగి, ఆగస్టు 15, ప్రభాతవార్త :** మండలంలో 80వ స్వాతంత్ర దినోత్సవవేడుకలను శనివారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సృజన, ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సయీద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రవికుమార్, రైతువేదికలో వ్యవసాయ విస్త రణ అధికారి నాగేంద్ర జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

### పాపన్నపేటలో...

**పాపన్నపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పావని నరేందర్‌గౌడ్, తహశీల్ కార్యాలంవద్ద తహశీల్దార్ సతీష్, పోలీస్‌స్టేషన్‌వద్ద ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో శ్రీనివాస్‌రాజు, జూనియర్ కాలేజ్ వద్ద ప్రిన్సిపాల్ నర్సింలు, ఉన్నత పాఠశాల వద్ద హెడ్మాస్టర్ మహేశ్వర్, యంఆర్‌సి వద్ద ఎంఈఓ ప్రతాప్ రెడ్డి, ఏడుపాయల దేవస్థానంవద్ద ఆలయ సంబంధిత అధికారి సూర్య శ్రీనివాస్ పతాకావిష్కరణ నిర్వహించారు.

### ఎస్విహెచ్ఎస్ స్మార్ట్‌కిడ్స్‌లో...

**గుమ్మడిదల ఆగస్టు 15, ప్రభాతవార్త :** ఎస్విహెచ్ఎస్ స్మార్ట్‌కిడ్స్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, ప్రసంగ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించడంతో పాటు ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు, సందేశాత్మక నాటికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు.

### జహీరాబాద్‌లో...

**జహీరాబాద్ ఆగస్టు 15 ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై. నరోత్తం పార్టీ నాయకులతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, శివకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, యస్. గోపాల్, యం. డి. సలీమ్, హసన్‌పర్వాన, చెంగల్ జైపాల్, యం. మల్లేశం, యస్. శ్రీనివాస్, పాండు, కె. మల్లేశం, సంగీత, గోపాల్, జగన్నాథ్‌రెడ్డి, మల్లేష్, ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్, రాజు, క్రిష్ణ, జగన్, శేఖర్, శ్రీనివాస్, అశోక్, మోహన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

### మెదక్‌లో...

**మెదక్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** పట్టణంలోని 9వ వార్డులో కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు.

### సదాశివపేటలో...

**సదాశివపేట ఆగస్టు 15 ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నాయబ్ వెంచర్ అధినేత, సామాజికవేత్త మహమ్మద్ వాజిద్ జాతీయ జెండాను ఎగరవేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖీజర్ ఇబ్రహీం నయా గ్రూప్ ఎండి, నయా గ్రూప్ డైరెక్టర్లు తోట చంద్ర శేఖర్, మహమ్మద్ నజీర్‌మోలానా పాల్గొన్నారు.

### సిపిఐ ఆధ్వర్యంలో...

**సదాశివపేట ఆగస్టు 15 ప్రభాతవార్త:** సీపీఐ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. తాజొద్దీన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. తాజొద్దీన్ మాట్లాడుతూ.. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యమని అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందరికీ అందేలా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం. డి. షఫీ, శంకరప్ప, ముంగి రమేష్, ముస్తఫా, సాదిక్ అలీ, వెంకట్, యూసుఫ్, యాకూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### జహీరాబాద్ మండలంలో...

**జహీరాబాద్ ఆగస్టు 15 ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం జహీరాబాద్ పట్టణంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలను జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్యాల జాతీయ జెండా ఎగురవేశారు. కాంగ్రెస్ కార్యాలయంపై మాజీమంత్రి డాక్టర్ చంద్రశేఖర్ జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంపై చైర్మన్ ఎండి యూనుస్, కోర్టులో సీనియర్ జడ్జి కవితాదేవి జెండాను ఎగరవేశారు. ఆర్డీవో కార్యాలయంపై ఆర్‌డిఓ దేవుజ, పోలీస్‌స్టేషన్ ఆవరణలో డిఎస్పి మీ సైదానాయక్ జాతీయ జెండాను ఎగురవేశారు.


తాసిల్దార్ కార్యాలయం పై తాసిల్దార్ దశరథ్, ఎంపీడీవో కార్యాలయంపై ఎంపీ డీవో మహేందర్‌రెడ్డి, పిఆర్‌డి కార్యాలయంలో డి రామచందర్, ఏరియా ఆసుపత్రిపై సూపరిండెడ్ డాక్టర్ కిరణ్, ఆర్టీసీ కార్యాలయంలో డిఎం స్వామి జెండాను ఎగర వేశారు. స్వతంత్ర వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం విద్యార్థులు, విద్యార్థినిలు సాంస్కృతి కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికా రులు ప్రజాప్రతినిధులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# మూడు రోజుల్లో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలి

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి**

**హవేలీఘనపూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకు పోయిన రాజ్‌పేట బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులకు ఇప్పటికీ టెండర్లు పిలవకపోవడం విడ్డూరంగా ఉందని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ నాయకురాలు పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. బ్రిడ్జి రోడ్డు లేక మూడు గ్రామాలు, రెండు మండలాలకు చెందిన రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హవేళిఘణపురం మండలం రాజిపేట బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది వర్షాల సమయంలో రాజ్‌పేట బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహానికి ఆటో కొట్టుకుపోయి ఇద్దరు రైతులు మృతి చెందిన ఘటన జరిగినప్పటికీ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 2023 లోనే బ్రిడ్జి నిర్మాణ పనులకు రెన్యువల్ వచ్చినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంపై ఆమె ప్రశ్నించారు. మూడేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో కనీసం బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు పిలవకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రోడ్డు సౌకర్యం లేక రైతులు తమ వ్యవసాయ పనులకు వెళ్లేందుకు, పంటలను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, వృద్ధులు, అత్యవసర సేవలకు వెళ్లే ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. మూడు రోజుల్లోగా రాజ్‌పేట బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించకపోతే గ్రామస్థుల సహకారంతో శ్రమదానం నిర్వహించి రోడ్డు ఏర్పాటు చేస్తామని పద్మాదేవేందర్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల సమస్యను ప్రభుత్వం, అధికారులు ఇకనైనా తీవ్రంగా పరిగణించి వెంటనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆమె డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మెన్ లావణ్య రెడ్డి హావేలిఘణపురం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తిని చాటిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

చౌటకూర్ ఆగస్టు 15 ప్రభాతవార్త : ఉమ్మడి పుల్కల్ మండలంలో మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది తిరంగా జెండా వేడుకల్లో పాల్గొని దేశ భక్తిని చాటారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పుల్కల్, చౌటకూర్లలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయ లకు ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాట చరిత్ర, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి బాధ్యత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణపై అవగాహన కల్పించారు. పుల్కల్ రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ కృష్ణ, మండల పరిషత్ వద్ద ప్రత్యేకాధికారి బాలరాజు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ నల్లా విశ్వజన్, చౌటకూర్ రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ కృష్ణ, మండల పరిషత్ వద్ద ఎంపీడీవో శంకర్, రైతు వేదిక వద్ద ఏఓ ప్రవీణ, జడ్పీహెచ్ఎస్లో హెచ్ఎం. అనురాధ, చౌటకూర్ పంచాయతీ వద్ద సర్పంచ్ పార్కల రాంరెడ్డిలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఐఐఐటీ బాసరకు ఎంపికైన విద్యార్థులకు రూ. ఐదు వేల చొప్పున ఇద్దరికీ ఉపాధ్యాయులు మోహన్రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు కలిసి నగదు అందజేశారు. ఇదిలావుండగా, ఆయా గ్రామాల్లో సర్పంచులు జాతీయ జెండాలను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అనసూయరాజశేఖర్, మల్లారెడ్డి, మల్లేశం, రేణుక, జైపాట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా రెపరెప లాడిన మువ్వన్నెల జెండా

**కౌడిపల్లి, ఆగస్టు 15, ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని శనివారం మండలంలోని ఆయా గ్రామాలలో వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. కౌడిపల్లిలోని గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణగౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోరి శ్రీనివాస రావు, ఎస్‌బిఐ వద్ద మేనేజర్ పవన్‌కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం లలితాదేవి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై అమరెందర్‌రెడ్డి, సమీకృత బాలికల వసతి గృహం వద్ద వార్డెన్ పద్మజ, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సూపరిండెంట్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో కార్యాలయం వద్ద డిఎల్‌పిఓ సురేష్ బాబు, తాసిల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ కృష్ణ , అగ్రికల్చర్ కార్యాలయం వద్ద ఏ ఓ స్వప్న, పంచాయతీ రాజ్ కార్యాలయం వద్ద డి ఈ ఈ అమరేశ్వర్, ఐకెపి కార్యాలయం వద్ద మండల మహిళ సమైక్య అధ్యక్షురాలు పుణ్యమ్మ, పశువైద్య కార్యాలయంవద్ద డాక్టర్ ఫర్వీన్ ఫాతిమా, ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓ బాలరాజు , ఆదర్శ వసతి గృహం వద్ద, ఎస్టీ వసతి గృహం వద్ద ఇన్చార్జ్ వార్డెన్ జయరాజ్, డిసిఎంఎస్ ట్రేడర్స్ వద్ద ప్రొప్రైటర్ జైగౌడ్, మండల పరిధి అన్ని గ్రామాలలో పంచాయతీ కార్యాలయ వద్ద సర్పంచులు పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ కేంద్రాలవద్ద అంగన్వాడీ టీచర్లు, జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయా పాఠశాలలో విద్యార్థులు వివిధ వేషధారణలలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేత మల్లికార్జున్‌గౌడ్, వార్డు సభ్యులు మాధవి మహేష్, ప్రశాంత్, దేవేందర్, మురళి, లక్ష్మీ శరత్, రాజురెడ్డి, యాదమ్మ, మక్బూల్, సందీప్‌కుమార్, బొంతమ్మ సంగప్ప, రమేష్‌నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సారా రామ గౌడ్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు యువ నాయకులు కౌడ శ్రీనివాస్‌గుప్త, యువనాయకులు పోల నవీన్‌కుమార్, కౌడిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రం కిషోర్ గౌడ్ ,ముదిరాజ్ సంఘం , గ్రామ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు నాండ్ల వెంకటేష్ గుప్తా, కురుమ లక్ష్మణ్, పుండరీకం గౌడ్, సత్యనారాయణ గౌడ్ , ,కౌడిపల్లి హై స్కూల్ మాజీ ఎస్ ఎం సి చైర్మన్ జగన్, సెక్రటరీ నాగేష్, కరోబార్ ఎల్లం, ఆయా శాఖల అధికారులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మొగుడంపల్లి ఆగస్టు 15 ప్రభాతవార్త :** జహీరాబాద్ మండలంలోని 33 కేవీ బూచినెల్లి ఫీడర్‌పై ఆదివారం మరమ్మతు పనులు చేపట్టనున్నారు. దీంతో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. బూచినెల్లి, బూర్దిపాడ్, తుంకుట, సత్వార్, చిరాగ్ పల్లి, మొగుడంపల్లి మండలంలోని మాడ్గి, ధనసిరి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుంది. వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఏఈ సతీష్ కుమార్ కోరారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు